## క్లుప్తంగా

### నేడు మండల సర్వసభ్య సమావేశం

**నారాయణపేట రూరల్:** మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, మండలస్థాయి అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

**నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం**

**నర్వ:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాథమిక సహకార కేంద్రంలో రైతుబంధు, రైతుభరోసా పథకం అమలు పారదర్శకంగా ఉండేందుకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ ఎల్. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశం మధ్యాహ్నం 2గంటలకు పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సంఘం డైరెక్టర్లు సభ్యులు, రైతులు పాల్గొని తమ సలహాలు, సూచనలు అందించాలని ఆయన కోరారు.

**2న కృష్ణాలో..**

**కృష్ణా:** మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలో వచ్చేనెల 2న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జానయ్య తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి గౌరవ సభ్యులు ఉదయం 11 గంటలకు కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. అదేవిధంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

### ‘ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలి’



**మరికల్:** ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలని ముదిరాజ్ సంఘం నాయకులు రామకృష్ణ, ఆంజనేయులు అన్నారు. మండలంలోని శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వెనకబడిన పేట జిల్లా అభివృద్ధి చెందాలంటే శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలన్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్ స్పందించి న్యాయం చేస్తారని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, శేఖర్, రాజు, రమేష్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు వినతి



**మక్తల్:** పట్టణ శివారులోని సర్వే నంబర్ 936, 941లో గల ఎంబికి సంబంధించిన 22ఎకరాల 33గుంటల భూమిని కాపాడాలని ఎంబీ సంస్థ సభ్యులు తహసీల్దార్ సువర్ణరాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కొందరు ఆ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకుని నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. ఎంబీ సంస్థ భూముల్లో నిర్మాణాలు నిలిపి వేయాలని గతంలో హైకోర్టు ఆదేశించిందని, వాటిని వెంటనే అమలు చేయాలని కోరారు. అక్రమంగా నిర్మాణం చేపడుతున్న నిర్మాణాలను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంబీ సంస్థ చైర్మన్ రేవ ప్రసాద్, శేఖర్, సీఏ జెర్మియా, సుదర్శన్, డువిడ్ రాజు, బుజ్జప్ప, యోహాను, లాజరస్ పాల్గొన్నారు.

### పెద్ద చెరువు పరిశీలన



**మక్తల్:** మక్తల్ శివారులోని పెద్ద చెరువులో ఒంద్రుమట్టి తరలించే విధానాన్ని శుక్రవారం విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. మక్తల్ చెరువు నుంచి ఒంద్రుమట్టిని అక్రమంగా తరలిస్తున్నారని, ఫిర్యాదులు అందడంతో విచారణ చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఒంద్రుమట్టి గుంతలు ఎంతలోతులో తీసుకున్నారు అనే పూర్తిస్థాయిలో కొలతలను చేసి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అధికారులు తెలిపారు.

### వర్షం కోసం పూజలు



**కృష్ణా:** మండలంలోని చేగుంటలో రైతులతో పాటు ఆలయ అర్చకులు గ్రామం నుంచి పాదయాత్రగా కృష్ణానదికి వెళ్లి, అక్కడి పవిత్రమైన నదినీటిని జల్దిబిందెలో తీసుకొచ్చి గ్రామంలోని పార్వతి పరమేశ్వరుడికి జలాభిషేకం చేశారు. ఈ మేరకు.. వర్షాలు సమృద్ధిగా కురవాలని, తమ పంటలు పండాలని భగవంతుడిని వేడుకున్నారు.

**మరికల్:** వర్షాలు లేక పంటలు ఎండుముఖం పట్టడంతో శుక్రవారం మండలంలోని మహిళలు కప్ప కావడికి పూజలు చేసి ఊరేగించారు. మంచి వర్షాలు కురవాలని, పంటలు పండాలని పాటలు పాడి, ఇంటింటి తిరిగి మహిళలు కప్ప కావడిపై బిందెలతో నీళ్లు పోస్తు పూజలు చేశారు.

# నీటిసంఘం ఎన్నికలు కలేనా?

- 2006లో చివరి సారిగా ఎన్నికల నిర్వహణ
- 16 ఏళ్లుగా కొలువుదీరని కొత్త పాలక వర్గాలు
- పట్టించుకోని ప్రభుత్వం



మరికల్ పెద్ద చెరువు (ఫైల్)

**మరికల్:** పదహారేళ్లుగా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో నిస్తేజంగా మారాయి. మరోవైపు మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువులు, కుంటలకు మరమ్మతు చేసినా వాటిపై అజమాయిషీ లేక నీటి విడుదల, మరమ్మతుపనులపై దృష్టి పెట్టేవారే కరువయ్యారు.

చెరువుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ కాకతీయ పథకాన్ని తీసుకొచ్చింది. ఒకప్పుడు చెరువుల అభివృద్ధి, నిర్వహణ, ఆయకట్టుకు నీటి సరఫరా చేయడం తదితర పనులు పర్యవేక్షణ పనులు నీటి సంఘాల పాలకవర్గాలు చేపట్టేవి. పదహారేళ్లుగా ప్రభుత్వం నీటిసంఘాల ఎన్నికలను నిర్వహించకపోవడంతో చెరువుల పర్యవేక్షణ కరువైంది. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, కుంటలను పునరుద్ధరించింది. కానీ నీటి సంఘాల పాలకవర్గం లేకపోవడంతో పనులను పట్టించుకునే వారు లేరు. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేపట్టారు. పలుచోట్ల చెరువులు, కుంటలు కబ్జాలకు గురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**గతంలో ఇలా..**

ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగానే వంద ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువుల ఆయకట్టు రైతులు చైర్మన్‌తోపాటు డైరెక్టర్లను ఎన్నుకునేవారు. పాలకవర్గ సభ్యులు చెరువుల నిర్వహణతోపాటు నీటిని పంట పొలాలకు విడుదల చేసుకొని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. అంతేకాకుండా రైతులను సమన్వయ పర్చుకుంటూ అభివృద్ధి పనులు నిర్వహించే వారు.16ఏళ్ల నుంచి నీటిసంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువుల నిర్వహణ ఎటూ పోతుందో అర్థం కావడం లేదు.

**వంద ఎకరాల ఆయకట్టు చెరువులు**

| మండలం | చెరువుల సంఖ్య |
|---|---|
| నారాయణపేట | 13 |
| కోయిల్‌కొండ | 14 |
| దామరగిద్ద | 08 |
| ధన్వాడ | 07 |
| మరికల్ | 07 |
| మొత్తం | 49 |

**2008నుంచి ఎన్నికలు బంద్..**

నారాయణపేట నియోజకవర్గంలో వంద ఎకరాల ఆయకట్టు, అంతకంటే ఎక్కువగా ఉన్న చెరువులు 49 ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2006లో రాష్ట్ర వ్యాప్తంగా వందఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువులకు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీకాలం 2008తో ముగిసింది. అప్పటినుంచి తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం వచ్చినా నీటి సంఘాల ఎన్నికల మాట ఊసెత్తడం లేదు. ప్రభుత్వం చెరువుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా నీటిసంఘాల ఎన్నికలు నిర్వహించి చెరువులను మరింత అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

**సంఘాలతోనే చెరువుల అభివృద్ధి**



నీటి సంఘాలను ఎన్నుకుంటేనే చెరువులు అభివృద్ధి చెందుతాయి. గతంలో నీటి సంఘాలు ఉండటంతో నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా వారి పర్యవేక్షణ కూడా పకడ్బందీగా ఉండేది. ప్రభుత్వం మిషన్‌కాకతీయ పథకం చెరువులను అభివృద్ధి చేసిన అక్కడక్కడ పనులు నాణ్యతగా జరగలేదు. కాంట్రాక్టర్లపై నీటిసంఘాలు ఉంటే పనులు పూర్తిగా జరిగి ఉండేవి. ఇప్పటికైనా నీటి సంఘాలను ఎన్నుకుని చెరువులను అభివృద్ధి పర్చాలి.

\- లక్ష్మప్ప, రైతు మరికల్

**తప్పకుండా నిర్వహిస్తాం..**

ఇది ప్రభుత్వ పరిధిలోని అంశం. ప్రభుత్వం నుంచి నీటిసంఘాల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు వస్తే తప్పకుండా నిర్వహిస్తాం. ప్రస్తుతం ఈ విషయం ఎలాంటి ఆలోచన లేదు.

\- సునీత, తహసీల్దార్, మరికల్

## విద్యారంగానికి సమయం కేటాయించాలి



ఎంఈఓ దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్, డీఈఓ

**నారాయణపేట రూరల్:** పదవీ విరమణ పొందిన శేషజీవితంలో విద్యారంగ అభివృద్ధికి కొంత సమయాన్ని కేటాయించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, డీఈఓ ఎండీ అబ్దుల్ఘని అన్నారు. ఊట్కూర్ ఎంఈఓ వెంకటయ్య పదవీవిరమణ సందర్భంగా వారు వేర్వేరుగా శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులతో కలిసి ఆయన చక్కగా పనిచేశారని, బడిబయటి పిల్లలను చేర్చడం, టెన్త్ ఫలితాల సాధనకు కృషిచేశాడని అన్నారు. భవిష్యత్‌లో జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి సూచను, సలహాలు ఇవ్వాలన్నారు. అంతకుముందు డీఈఓ కార్యాలయ సిబ్బంది, వివిధ ఉపాధ్యాయ సంఘం నాయకులు, లయన్స్‌క్లబ్ సభ్యులు సన్మానించి మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ్‌బట్టడ్, టీచర్స్ యూనియన్ బాధ్యులు నర్సింహారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహ, కిశోర్, జనార్ధన్, రవికుమార్‌గౌడ్, విద్యాసాగర్, శ్రీనివాస్, నాగార్జున్‌రెడ్డి, ఉదయభాను, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

**నారాయణపేట రూరల్:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు, నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లతో శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ మేరకు.. ఆ సంఘం జిల్లా కన్వీనర్ నరేష్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ ప్రాతినిత్యం వహిస్తున్న సొంత జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు దయనీయంగా ఉన్నాయని, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టడానికి స్కావింజర్లను నియమించాలని డిమాండ్ చేశారు. వసతులతో పాటు విద్యాబోధన చేయడానికి తగిన టీచర్ల నియామకం జరగాలని, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా లాభార్జనే ధ్యేయంగా ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ ఫీజులు వసూలు చేస్తున్నారని, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్ పుస్తకాలు ఇలా అన్ని తమ వద్దనే కొనాలని భయపెడుతున్నారని అలాంటి స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఈఓ అబ్దుల్‌ఘనికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, చరణ్, వెంకటేష్, వరుణ్, మణికంఠ, సిద్దర్థ, శివ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**మక్తల్ (ఊట్కూరు):** రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ భవనంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. వివిధ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో చౌకధర దుకాణాలు, సరుకుల వివరాలను ఉప తహసీల్దార్ అమిరుద్దీన్ అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చౌకధర దుకాణాల డీలర్లు సమయపాలన పాటించడం లేదని దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఎంపీపీ ఉప తహసీల్దార్‌కు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సరకులు పక్కదారి పట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. మండలంలో జింకల బెడద అధికంగా ఉందని వేసిన పంటలను, మొక్కలను జింకలు తింటున్నాయని దీంతో రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, అటవీశాఖ అధికారి సంతోషకు సూచించారు. జింకలను తరలించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని ఆమె ఆదేశించారు. విద్యాశాఖ, వైద్యశాఖ, మిషన్ భగీరథ తదితర శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, వైస్ ఎంపీపీ ఎల్లగౌడ్, వివిధ శాఖ అధికారులు వెంకటేష్, జయచంద్ర, ఏఓ గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ



పేటలో అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు



ధన్వాడలో..

**నారాయణపేట:** స్థానిక మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. పట్టణంలోని వార్డులలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె అనసూయ, మున్సిపల్ కమిషనర్ సునీత, వార్డు ఆఫీసర్స్, ఇతర సిబ్బందిచే ర్యాలీ నిర్వహించి, ఇంటింటి తిరిగి అవగాహన కల్పించారు. నీటిని నిల్వ ఉండే ప్రదేశాలను శుభ్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్లు చెన్నకేశవులు, శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**కోస్గి:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై మున్సిపాలటీలో అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. పట్టణ ప్రజలు వారంలో ఒకరోజు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి నిర్దిష్ట ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మున్సిపాలటీ పరిధిలో ప్రతి శ్రువారం డ్రై డే కార్యక్రమం చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ శశిధర్ సూచించారు. ఈ మేరకు.. పట్టణంలో కౌన్సిలర్స్, మేనేజర్స్, వార్డు ఆఫీసర్స్, ఇతర సిబ్బందిచే ర్యాలీ నిర్వహించి, ఇంటింటి అవగాహన కల్పించారు. నీటిని నిల్వ ఉండే ప్రదేశాలను శుభ్రపరుచుకోవాలని సూచించారు. వ్యాధులు ప్రబలినప్పుడు స్థానిక ఆరోగ్య సిబ్బందికి వెంటనే తెలియజేయాలని ఆయన ప్రజలకు సూచించారు.

**నారాయణపేట (ధన్వాడ):** మండలంలోని గోటూర్‌లో శ్రువారం డ్రై డే నిర్వహించారు. ఈ మేరకు.. ఎంపీడీఓ సాయి ప్రకాష్, పంచాయతీశాఖ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి సిబ్బందిచే ర్యాలీ నిర్వహించి, ఇంటింటి అవగాహన కల్పించారు. నీటిని నిల్వ ఉండే ప్రదేశాలను శుభ్రపరుచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

### భరత్‌కుమార్‌ను సన్మానించిన ఎమ్మెల్యే



**నారాయణపేట:** ఉపాధ్యాయ వృత్తిలో ఉండి పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయుడు భరత్ కుమార్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోనీ సీవీఆర్ భవన్‌లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, మాజీ ఎంపీపీ సదాశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పీవీ నరసింహారావుకు ఘన నివాళి



**మక్తల్:** మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు.. పలువురు నేతలు మాట్లాడుతూ పీవీ నరసింహారావు ప్రధాన మంత్రి హయంలో దేశానికి ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో చంద్రకాంత్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడ గణేషకుమార్, కట్టవెంకటేష్, నారాయణ, రవికుమార్, ఆనంద్‌గౌడ్, రాజేందర్, శ్రీనివాసులు, వెంకట్‌రాములు, గోవర్ధన్, నాగేందర్ పాల్గొన్నారు.

## బాలల హక్కులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

**మక్తల్ (ఊట్కూరు):** పులమామిడి హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. సిబ్బంది శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలలోపు బాలికలకు పెళ్లిళ్లు చేయొద్దని సూచించారు. ఐదు సంవత్సరాలు పైబడిన బాలికలందరిని బడిలో చేర్పించాలన్నారు. ఎవరైనా బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే 1098 ఫోన్‌నంబర్‌కు సమాచారం అందించాలని చెప్పారు. బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నందిని, జయశ్రీ, జ్యోతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ‘సింగరేణి’ ప్రైవేటీకరణను ఆపాలి



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

**అమరచింత:** సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను ఆపాలంటూ శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ తెలంగాణకు బంగారు గనిగా ఉన్న సింగరేణిని బీజేపీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేసేందుకు చర్యలను వేగవంతం చేస్తోందని విమర్శించారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలో సింగరేణి వేలం ద్వారా టెండర్లను ఆహ్వానించడంతో ప్రైవేట్ ప్రక్రియ వేగవంతంగా చేయడానికి రంగం సిద్ధం చేసిందన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలన్నీ నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేందుకే పనిచేస్తుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఆర్ఎన్ రమేష్, అజయ్, శ్యాంసుందర్, నరసింహ, విష్ణు, పాషా, ఆటో రాము తదితరులు పాల్గొన్నారు.

### పదవి విరమణ ఉద్యోగి జీవితం తప్పదు



**మద్దూరు:** పదవీ విరమణ ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో తప్పదని పంచాయతీరాజ్ ఎస్ఈ మోహన్‌రావు తెలిపారు. మండలంలోని సబ్ డివిజన్ పంచాయతీ డిప్యూటీ ఈఈ బాబురావు పదవీ విరమణ శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించారు. ఈమేరకు.. ఆయా మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం శాలువాతో సన్మానించారు. ఈఈ హీర్యానాయక్, ఏఈలు విలోక్, అంజిరెడ్డి, ఆయా మండలాల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన టీచర్లు విధుల్లో చేరిక



జీహెచ్ఎంకు జాయినింగ్ రిపోర్ట్ అందిస్తున్న పీఎస్ హెచ్ఎంలు, పీడీలు



కృష్ణాలో..

**నారాయణపేట రూరల్:** జిల్లాలో పదోన్నతులు పొందిన టీచర్లు వారికి అలాట్ చేయబడ్డ పాఠశాలల్లో శుక్రవారం విధుల్లో చేరారు. ఎస్జీటీలుగా ఉన్న సీనియర్ టీచర్లకు పీఎస్ హెచ్ఎంలుగా, పీఈటీలకు పీడీలుగా ప్రమోషన్ రావడంతో వారు వెబ్ ఆప్షన్ల ద్వారా కోరుకున్న స్థానాలను కేటాయిస్తు అర్ధరాత్రి ఉత్తర్వులు జారీచేశారు. దీంతో వారు ఉదయం వారి పాత స్థానంలో రిలీవ్ అయ్యి కొత్త పాఠశాలలో జాయినింగ్ లెటర్లు అందించి విధుల్లో చేరారు. పీఎస్ హెచ్ఎంలుగా 68, పీడీలుగా 29లకు పదోన్నతి లభించింది. వీరిలో రెండు, అంతకంటే ఎక్కువ విభాగాల్లో పదోన్నతి పొందిన వారు 15రోజుల్లోపు ఏదో ఒకచోట వారు విధుల్లో చేరాల్సి ఉంటుంది. ఇక ఎస్జీటీలకు సంబంధించి బదిలీల ప్రక్రియ జరగాల్సి ఉండగా, సీనియార్టీ లిస్టను డీఈఓ కార్యాలయ సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. ఇక మల్టిపుల్ ఆప్షన్ ప్రక్రియ ద్వారా మిగిలిపోయిన బ్యాక్‌లాక్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు నష్టపోయిన టీచర్లకు హామీ ఇస్తున్నారు. ఇక ఎల్‌పీ హింది, పీఈటీ పోస్టులకు సంబంధించి అప్‌గ్రేడ్ కాని చోట్లకు మిగిలిపోయిన టీచర్లను సర్దుబాటు చేసే ప్రక్రియ ప్రారంభమైంది.

**కృష్ణా:** గత కొన్నేళ్లుగా పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం మండలంలోని కుసుమర్తి, ఖాన్‌దొడ్డి ఉన్నత పాఠశాలలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ మేరకు.. ఉపాధ్యాయులు డి.శేఖర్, గుర్జాల్ సూర్యకాంత్‌ను ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిల్, నాగభూషణం, గోపాల్, నాగరాజ్, శివరాజ్, సీఆర్‌పీలు అమీన్‌రెడ్డి, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో క్రమశిక్షణ అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**మరికల్:** విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటేనే భవిష్యత్‌లో స్థిరపడుతారని ఏఎస్ఐ మసుద్ అన్నారు. మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చదువుపై ఏకగ్రత పెట్టాలని సూచించారు. అలాగే సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యలను ఎలా ఎదుర్కొవాలనే అంశంపై సలహాలు, సూచనలు అందజేశారు. ఎవరైనా రోడ్లపై ఆకతాయిలు వేదింపులకు గురిచేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, రుక్యానాయక్, కల్యాణి పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సమగ్ర చట్టం తీసుకురావాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**ఆత్మకూర్:** దేశంలో అత్యధికంగా ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం కొసాగిస్తున్నారని, వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్మికులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందించారు. వ్యవసాయ కూలీలకు రూ.600 కూలి, ఇన్సూరెన్స్, బీమా అమలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రూ.12 వేలు జీవనభృతి కల్పించాలని, 50ఏళ్లు దాటిన వారికి రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు స్టీఫెన్, కుర్మన్న, వెంకటన్న, మాసన్న, రైతులు ఉన్నారు.

### గుట్కాల పట్టివేత



**నారాయణపేట:** టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులలో రూ.16,368 విలువ గల ప్రభుత్వ నిషేధిత గుట్కాలను పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలో అశోక్ నగర్‌కి చెందిన యూసుఫ్ తాజ్ అనే వ్యక్తికి చెందిన కిరాణా షాప్‌లో గుట్కా విక్రయిస్తున్నారని పక్కాసమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి గుట్కా ప్యాకెట్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యూసుఫ్ తాజ్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

### స్కూల్ విద్యార్థి ప్రతినిధుల ఎన్నిక

**కొత్తకోట:** పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ మాలతి ఆధ్వర్యంలో శుక్రవారం స్కూల్ విద్యార్థి ప్రతినిధుల ఎంపిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్‌తో పాటు లిటరరీ, కల్చరల్, స్పోర్ట్స్, హెల్త్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌కు విద్యార్థులు ఓటు వేసి ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలను సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే నిర్వహించి ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల ప్రాధాన్యతను విద్యార్థులు అర్థం చేసుకునే అవకాశం కల్పించిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ అభినందించారు. విద్యార్థి దశ నుంచే నిర్వహించే మాదిరి ఎన్నికలు భావి పౌరులకు వారి బాధ్యతను తెలియజేస్తాయన్నారు.

### పుస్తకాలు అమ్మితే చర్యలు

**మద్దూరు:** ప్రైవేట్ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు అమ్మితే ఆ పాఠశాలలపై చర్యలు తప్పవని ఎంఈఓ గోపాల్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మండలంలోని ప్రైవేట్ పాఠశాలలో వీటిని అమ్ముతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. త్వరలో ప్రైవేట్ పాఠశాలలో విచారణ చేస్తామని, నిజమని తెలితే వాటిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.